

మేడిగడ్డ బ్యారేజీకి 6.07 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహాదేవపూర్ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం బ్యారేజీలోకి 6.36 క్యూసెక్కులు, శుక్రవారం 6.07లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా గేట్లన్నీ ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రస్తుతం 6.9 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

- ఘనంగా విజయదశమి
- వైభవంగా రావణాసురుడి దహనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఊరంతా దసరా



భూపాలపల్లిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ప్రజలు



అంబేద్కర్ క్రీడామైదానంలో రావణుడి దహనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయదశమి వేడుకలు భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా జరిగాయి. జిల్లాలోని 12 మండలాల్లోని 248 గ్రామాల్లో ప్రజలు దసరాను ఉత్సహంగా నిర్వహించారు. రావణసురుడి ప్రతిమను బాణసంచాతో కాల్చి సంబరాలు చేసుకున్నారు. విజయదశమిని పురస్కరించుకుని ఇంటింటా మేకలు, కోళ్ల కోసి, పిండివంటలు చేసుకుని విందు ఆరగించా రు. దూరప్రాంతంలో ఉన్న బంధువులు, కుటుంబ సభ్యులు సైతం ఒకచోటకు చేరి పండగను జరుపుకున్నారు. పలువురు తమ వాహనాలను శుభ్రం చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా స్టేషన్లలో పోలీసులు ఆయుధ పూజ నిర్వహించారు. విజయదశమి సందర్భంగా భూపాలపల్లి పట్టణం లోని అంబేద్కర్ క్రీడా మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. టీవీ ఆర్టిస్టులు ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ ఆహూతులను ఆకట్టుకున్నాయి. పలువురు నృత్య కళకారులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. సుమారు 70 అడుగుల రావణాసురుడి ప్రతిమను ఏర్పాటు చేయగా బాణసంచాతో ఆయన కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రాణం ఉన్నంత కాలం ప్రజల కోసమే పనిచేస్తానని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తానన్నారు.

రావణవధ కార్యక్రమానికి హాజరైన జనం





ములుగులో రావణవధ

సందడే సందడి





రావణవధకు బాణసంచాను కాల్చుతున్న జడ్జి కన్నయ్య లాల్

- ఊరూవాడా విజయ దశమి
- వైభవంగ అమ్మవారి శోభాయాత్రలు
- జిల్లా వ్యాప్తంగా ఆయుధ, శమీ పూజలు
- సంబురంగా రావణుడి సంహారం

ములుగు టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలు జిల్లాలో గురువారం ఘనంగా జరిగాయి. పల్లెల్లో ఉదయం నుంచే సందడి నెలకొన్నాయి. ఊర్లన్నీ కళకళలాడాయి. రోజంతా ఆయుధ పూజలు, శమీ పూజల్లో భక్తులు నిమగ్నమై పోయారు. సాయంత్రం వేళ బొడ్రాయి, భూలక్ష్మి, పోశమ్మలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం (మిగతా 8లో..)



దుర్గామాత శోభయాత్రలో పాల్గొన్న మంత్రి సీతక్క



భూపాలపల్లి కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

గాంధీజీకి ఘన నివాళి

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ జయంతి వేడుకలు భూపాలపల్లి కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా జరిగాయి. గాంధీ చిత్రపటానికి కలెక్టర్ రాహుల్‌శర్మ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన అహింసా, శాంతి మార్గం ద్వారానే సమాజంలో ఉన్న సమస్యలు, విభేదాలు, ఒత్తిళ్లను అధిగమించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీవో బాలకృష్ణ, పీపీ ఈఈ బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ములుగులో జరిగిన వేడుకలకు ఆ జిల్లా కలెక్టర్ టీ.ఎస్.దివాకర హాజరయ్యారు. ములుగులోని గాంధీపార్కులోని గాంధీజీ విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులు అర్పించారు.

అదేవిధంగా కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆంగ్లేయుల పాలన నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు గాంధీజీ అని అన్నారు. సత్యా గ్రహం ఆయన ఆయుధమని, అన్ని మతాలు, కులాలు ఒకటేనని చాటిచెప్పారని అన్నారు.



ములుగు కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ దివాకర

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, మునిసిపల్ కమిషనర్ సంపత్, ఎంపీడీవో రామకృష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకుడు సలీం, తహసీల్దార్ గిరిబాబు, అధికారులు, సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం.. దైన్యం

- జీజీహెచ్‌లో వైద్యుల కొరత
- విధులను బహిష్కరించిన డాక్టర్లు?
- పని ఒత్తిడి పెరిగిందని ఆవేదన!

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో పలువురు డాక్టర్లు తమ సేవలను నిలిపివేసినట్టు తెలుస్తోంది. ఇక్కడ డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. ఆస్పత్రిలో 15 మంది క్యాజువాలిటీ డాక్టర్లు సేవలు అందించాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో తమపై పని ఒత్తిడి పెరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉన్న ఇద్దరు కూడా కొన్ని రోజులుగా విధులకు హాజరు కావడం లేదని తెలిసింది. క్యాజువాలిటీ డాక్టర్లు సేవలు బహిష్కరించడంతో రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 1 నుంచే డాక్టర్లు సేవలు బహిష్కరించినట్టు తెలుస్తుండగా ఇది ఆలస్యం వెలుగులోకి వచ్చింది. క్యాజువాలిటీ వైద్యులు విధులకు రాకపోవడంతో చేసేదేమీ లేక ఫారిన్ మెడికల్ గ్రాడ్యూయేట్స్‌ల సేవలను వినియోగించుకుంటున్నారని సమాచారం. ఇలా అనుభవం కలిగిన డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు చేసేదేమీ లేక ప్రైవేటుకు పరుగులు తీస్తున్నారని తెలుస్తోంది. ఆస్పత్రిలో ఇంత జరుగుతున్నా సూపరింటెండెంట్ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. క్యాజువాలిటీలో డాక్టర్ల కొరత విషయాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాల్సి ఉండగా నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై కలెక్టర్, ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పిడిశెట్టి స్వాతి (ఫైల్)

తండ్రీకొడుకుల గొడవలో బలైన తల్లి

నెల్లికుదురు మండలం ఆలేరులో ఘటన

వివరాలు 7వ పేజీలో...

రామప్పను సందర్శించిన టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ

వెంకటాపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేటలో ఉన్న యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణరెడ్డి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ వాజ్‌పేయి దంపతులు శుక్రవారం సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని వారు దర్శించుకోగా అర్చకులు ఉమాశంకర్, హరీశ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించిన వరుణ్‌రెడ్డి దంపతులు ఆలయ చరిత్ర, విశిష్టతను గైడ్ ద్వారా తెలుసుకున్నారు. వారి వెంట ములుగు డీఈ నాగేశ్వర్‌రావు, ఏడీఈ వేణుగోపాల్, స్థానిక ఏఈ రమేష్, సబ్ ఇంజనీర్ సాంబరాజు, లైన్‌మెన్‌లు సురేష్, కృష్ణాకర్, సిబ్బంది ఉన్నారు.



ఆలయ విశిష్టత గురించి గైడ్ ద్వారా తెలుసుకుంటున్న వరుణ్‌రెడ్డి దంపతులు

స్థానిక ఎన్నికల్లో గెలిపించండి

బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు బలరాం




సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

ఏటూరునాగారం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సరికొండ బలరాం అన్నారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే మరొకసారి స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని ఆయన విమర్శించారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు వినుకొల్ల చక్రవర్తి ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రారం జరిగింది. ముఖ్యఅతిథిగా బలరాం హాజరయ్యారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాతే స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత కాంగ్రెస్ నాయకులకు ఉంటుందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా మహిళలకు రూ. 2,500, తులం బంగారం, వృద్ధులకు పెన్షన్, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, దివ్యాంగులకు పెన్షన్, రైతు భరోసా, నిరుద్యోగులకు రూ. 2 లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా కార్డుతో పాటు విద్యార్థినులకు స్కూటీ వంటి హామీలను నెరవేర్చాలన్నారు. ఈసారి స్థానిక ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బహర్ లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి వెంకట్, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతనిధి జాడి రామరాజు నేత, రాష్ట్ర గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం, జిల్లా కార్యదర్శి ఈక మహాలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకుల కృష్ణకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధించుకుంటేనే మనుగడ

- సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి
- సంస్థ భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తి చేస్తేనే సింగరేణి మనుగడ సాధ్యమని ఆ సంస్థ భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి సింగరేణి జీఎం కార్యాలయంలో అన్ని గనుల విభాగం అధికారులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. భూపా లపల్లి ఏరియాలో వంద లక్షల టన్నులు సాధించే దిశగా ఏరి యాలో సంస్థలో చేపట్టాల్సిన కొత్త ఆవిష్కరణల కోసం తీసు కోవాల్సిన చొరవ, రానున్న ఐదు సంవత్సరాలకు ప్రణాళికలు, వ్యూహ రచనలు, నష్టాలు తగ్గించుకోవడం, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచే విధానం గురించి, పెండింగ్ పనుల పరిశీలనల గురించి ఇతరత్రా అంశాలను సమీక్షించారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్ఓటూ జీఎం కవీంద్ర, ఏజీఎం (సివిల్) రవికుమార్, ఓసీ-2 పీవో శ్యాంసుందర్, ఓసీ-3 పీవో భిక్షమయ్య, కేటీకే వన్ గ్రూప్ ఏజెంట్ రవీందర్, ఏరియా సేఫ్టీ అధికారి జి.ఎల్.ప్రసాద్, ఏరియా సర్వే అధికారి పి. రాజేశ్వర్, వివిధ గనుల మేనేజర్లు పాల్గొన్నారు.



దినసరి కార్మికుల వినూత్న నిరసన

గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ

ఏటూరునాగారం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారంలో గిరిజన సంక్షేమ శాఖ పరిధి హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న దినసరి కార్మికులు చేస్తున్న సమ్మె 21వ రోజుకు చేరింది. దసరా పండుగను కూడా చేసుకోకుండా కార్మికులు నిరసనను కొనసాగించారు. సమ్మెలో భాగంగా ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి బొడ్రాయి ప్రాంతంలోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి వినూత్న నిరసన తెలిపారు. గాంధీజీ సిద్ధాంతాన్ని పాటిస్తూ శాంతియుతంగా 21 రోజులుగా సమ్మె చేస్తున్నామని, అయినా పాలకులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. దావూద్ మాట్లాడుతూ కార్మికుల ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం యూనియన్ నాయకులతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిది నెలల నుంచి జీతాలు లేక కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మరోవైపు వస్తున్న వేతనాలను తగ్గిస్తూ జీవో నంబర్ 64ను తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ జీవో వల్ల ఒక్కొక్కరికి గత సంవత్సరంతో పోలిస్తే జీతంలో నగం రూపాయలు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చిటమట రమేష్, వర్కర్లు ఎం. నాగలక్ష్మి, గొంది లక్ష్మి, కె. భాగ్యలక్ష్మి, ఎం. జయలక్ష్మి, జి. సత్యం, ఊకే సమ్మక్క, కె. కమల, విజయలక్ష్మి, రాజు, సమ్మయ్య, సూర్యతేజ, ఇందిరా, సుమలత, సాంబయ్య, శివకృష్ణతో పాటు సుమారు 50 మంది కార్మికులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహానికి మెమొరాండం అందజేస్తున్న దినసరి కార్మికులు, సీఐటీయూ నాయకులు

మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్

- హోటల్ నిర్వాహకులపై దాడికి దిగడంతో చర్య
- మద్యం తాగినట్లుగా వైద్య పరీక్షల్లో వెల్లడి

వరంగల్ క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్ పరిధిలో చింతల్ ప్రాంతంలో ఆగస్టు 23వ తేదీన ఓ హోటల్ నిర్వాహకురాలు సంద్ర మరియమ్మ, ఆమె కుమారుడు శేఖర్‌పై దాడి చేసిన ఘటనలో ఎస్సై శ్రీకాంత్‌ను సస్పెండ్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అర్ధరాత్రి పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఎస్సై శ్రీకాంత్ హోటల్ నిర్వాహకులతో గొడవ పడ్డాడు. ఈ ఘటన జరిగిన మరుసటిరోజు బాధితురాలు మరియమ్మ, ఆమె కుమారుడు శేఖర్‌తో కలిసి ఎస్సై శ్రీకాంత్‌పై ఫిర్యాదు చేశారు. మద్యం మత్తులో తమపై దాడి చేసి, కులం పేరుతో దూషించాడని మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై శ్రీకాంత్ రక్త నమూనాలను పరిశీలించగా మద్యం తాగినట్లుగా తెలింది. దీంతో ఎస్సైపై సీపీ చర్య తీసుకున్నట్లు తెలిసింది.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

బచ్చన్నపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త రమ్య (28) అనే మహిళ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. భర్త కొత్త రాజు ముంబాయిలో ఉంటూ, ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. వీరికి ఇద్దరు కుమారులు. కాగా బార్యభర్తల మధ్య మనస్పర్థలే రమ్య ఆత్మహత్యకు కారణమని చెబుతున్నారు. రమ్య మృతితో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సమాచారం తెలుసుకున్న ఏసీపీ పండరి చేతన్ నితిన్, ఎస్ఐ అబ్దుల్ హమీద్‌లు అక్కడికి చేరుకుని శాంతింపజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పండుగకు వస్తూ కానరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఇప్పగూడెం వాసి మృతి
- యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి వద్ద ప్రమాదం

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు వస్తూ మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన కత్తుల సంపత్ (29) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి వద్ద గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కిశే కత్తుల కొమురయ్య-క్యాతమ్మ దంపతుల పెద్ద కుమారుడు సంపత్ హైదరాబాద్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండుగకు తన అత్తగారి ఊరైన దేవరుప్పుల మండలంలోని కోలుకొండకు భార్య సౌమ్య, మూడేళ్ల కుమారుడితో కలిసి తన బైక్ పై వస్తున్నాడు.

ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి వద్ద రాంగ్ రూట్‌లో వచ్చిన మరో బైక్, దంపతుల బైక్‌ను ఢీకొట్టింది. దీంతో సంపత్ తలకు బలమైన గాయాలు కాగా, సౌమ్య తీవ్రంగా గాయపడింది. బాధిత దంపతుల మూడేళ్ల బాబు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సంపత్‌ను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సౌమ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. సంపత్ అకాల మరణంతో స్వగ్రామం ఇప్పగూడెంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఏటూరునాగారం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మండలంలోని ఆల్లవారిఘణపురం గ్రామ పంచాయతీ పరిధిలోని వీరాపురం గొత్తికోయగూడానికి వెళ్లే మట్టి దారిలో మృతదేహం కనిపించినట్లు సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి సుమారు 5.3 అడుగుల ఎత్తు, 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని అన్నారు. బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, నలుపు రంగు లోయర్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు లేదా ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే ఏటూరునాగారం సీఐ 8712670113, ఎస్సై 8712670090, ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ 8712670091 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మానేరులో ఒకరి గల్లంతు


రాజేందర్ (ఫైల్)

టేకుమట్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికోట గ్రామ శివారులోని మానేరు వాగులో ఒకరు గల్లంతైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుధా కర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం గిద్దె ముత్తారం గ్రామానికి చెందిన అజ్మీరా రాజేందర్, పంచిక తిరుపతి పని నిమిత్తం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి బయల్దేరారు. మానేరు దాటేందుకు ప్రయత్నించగా రాజేందర్ ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. అప్రమత్తమైన తిరుపతి అటువైపు వెళ్లకుండా వెనుదిరిగాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అయినా రాజేందర్ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో మానేరులో గాలింపు చర్యలు చేపట్టారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కృష్ణకాలనీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని రాంపూర్ శివారులో ఉన్న భీంఘన్‌పూర్ చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాంపూర్ గ్రామానికి చెందిన నలుబోతుల అంజన్న (36) ఈ నెల 27న చేపల వేటకని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మళ్లీ తిరిగి రాకపోవడంతో ఈ నెల 29న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు చెరువులో అంజన్న మృతదేహం తేలియాడుతూ కనిపించింది. దీంతో వారు కుటుంబ సభ్యులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడు కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఉండేవాడని అతడి తమ్ముడు సతీష్ ఫిర్యాదులో పేర్కొన్నాడని ఎస్సై సాంబమూర్తి తెలిపారు. మృతుడు అవివాహితుడు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు అశోక్


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్

గోవిందరావుపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. గోవిందరావుపేట మండలంలోని చల్వాయిలో పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్, డ్వాక్రా రుణాలు ఇచ్చి మహిళలను అభివృద్ధిపథంలో నడిపిస్తోందన్నారు. అదేవిధంగా రైతులకు పెద్దపీట వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని, 2018 నుంచి 2023 వరకు పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతుకూ రూ.2లక్షల రుణమాఫీ అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. రైతు భరోసా ద్వారా రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.12వేల భరోసా అందించిందని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందించిందని అన్నారు.

ములుగు నియోజక వర్గానికి అత్యధికంగా 5వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు చేర్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. అదేవిధంగా వ్యక్తిగత పదవులకన్నా పార్టీ శ్రేయస్సే ముఖ్యమని, పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు దాసరి సుధాకర్, జెట్టి సోమయ్య, కణతల నాగేందర్‌రావు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కృష్ణకాలనీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన మందల రాజిరెడ్డి అనే వ్యక్తి ఇంటికి గురువారం రాత్రి 11 గంటల సమయములో వెళ్లి దాడి చేసిన భూపాల్ లక్ష్మయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. భూపాల్ లక్ష్మయ్య అనే వ్యక్తి రాజిరెడ్డి ఇంటికి వెళ్లి పటేలా.. పటేలా అని పిలువగా తాను బయటకు రావడంతో తన చేతిలో ఉన్న కర్రతో అకారణంగా దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారన్నారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ వివరించారు.

పేకాట రాయళ్ల అరెస్టు

కన్నాయిగూడెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్సై ఇనిగాల వెంకటేశ్ తెలిపారు. వారి నుంచి రూ. 3,100 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పీఎస్ ఎదుట ప్రధాన రహదారిపై మృతుడి బంధువుల రాస్తారోకో

ఏసీపీ నచ్చజెప్పడంతో విరమణ

బచ్చన్నపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామంలో గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని వదిలేశారని, మృతుడు కుటుంబానికి న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట, జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పోచన్నపేటకు చెందిన కందుల స్వప్న-గోపి దంపతుల చిన్న కుమారుడు కందుల అర్జున్ (16), శ్రీపతి కృష్ణప్రసాద్ అనే యువకులు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్న క్రమంలో ఆలేరు వైపు నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొంది. దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న అర్జున్ ఎగిరి కిందప డడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా, మృతి చెందినట్టు తెలిపారు. అలాగే కృష్ణప్రసాద్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. కారును వరంగల్ కాశిబుగ్గకు చెందిన బొచ్చు క్రాంతికుమార్ అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. కాగా క్రాంతి కుమార్‌ను రాత్రి అదుపులోకి తీసుకుని, పోలీసులు వదిలేశారంటూ ఆరోపిస్తూ, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేస్తూ రాస్తారోకోకు దిగారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్ఐ అబ్దుల్ హమీద్ నచ్చజెప్పినప్పటికీ వారు విరమించక పోవడంతో జనగామ ఏసీపీ పండరి చేతన్ నితిన్ వచ్చి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


పీఎస్ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న మృతుడి బంధువులు

వేంకన్న ఆలయంలో శ్రవణ నక్షత్ర హోమం

మాస కల్యాణం


వేంకన్న ఆలయంలో మాస కల్యాణం జరిపిస్తున్న పూజారులు

చిలుపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న దేవాలయంలో గురువారం హోమ పూజతో పాటు, మాస కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యుల నేతృత్వంలో వెంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్లకు దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న పట్టువస్త్రాలతో పాటు, పూలమాలలను సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మాస కల్యాణం జరిపించి భక్తులకు ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు గోలి రాజశేఖర్, పుల్యాల నారాయణరెడ్డి, వేముల వెంకటేశ్వర్లు, గనగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధితో యువకుడి మృతి

చెన్నారావుపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కుక్క కాటుకు గురై రేబిస్ వ్యాధి సోకటంతో యువకుడు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఈర్యతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఈర్య తండాకు చెందిన గుగులోతు సునీత- భద్రు దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు రాజుకుమార్ (23)కు ఆరు నెలల కిందట కుక్క కరిచింది. కుక్క కాటుకు గురైన రాజుకుమార్ వైద్యుల సలహాలు తీసుకోకపోవడంతో పాటు రేబీస్ వ్యాధిపై అవగాహన లేక ఎలాంటి చికిత్స చేయించలేదు.

దీంతో రాజుకుమార్‌కు రేబిస్ వ్యాధి సోకి కొన్ని రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తల్లిదండ్రులు రెండు రోజుల కిందట హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రేబిస్ వ్యాధి తీవ్రమవడంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. దీంతో పండుగ పూట తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. రేబిస్ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, బాధిత కుటుంబాన్ని ట్రాక్టర్ యూనియన్ నాయకులు గోడిశాల మల్లయ్యగౌడ్, లక్క ఇంద్రయ్య, వల్ల సదానందం. శోభన్ తదితరులు పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమదేవరపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం కొత్తపెల్లి గ్రామ చెరువు సమీపంలో వేల్పుల పోచయ్య (60) శుక్రవారం రాత్రి మృతి చెందారు. కొత్తపెల్లి గ్రా మానికి చెందిన పోచయ్య తన అత్తగారి ఇల్లు అయిన హసన్‌పర్తి మండల కోమటిపల్లి గ్రామంలో భార్య పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా తన స్వగ్రామమైన కొత్తపల్లికి మూడు రోజుల కిందట వచ్చాడు.

పండుగ చూసుకుని శుక్రవా రం రాత్రి తిరిగి కోమటిపల్లికి వెళ్లేందుకు కొత్తపల్లి చెరువు కట్టపై నుంచి నడుచుకుంటూ ప్రధాన రహదారిపైకి చేరుకున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో పోచయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతోపాటు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇరువురికి తీవ్ర గాయాలు


సంఘటనా స్థలంలో మృతి చెందిన అశోక్

దామెర, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-163 దామెర మండలంలోని ఊరుగొండ గ్రామ సమీపంలో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళితే... దామెర మండల బీజేపీ అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్‌తో పాటు తన బావ అరూరి అశోక్(28) ఇద్దరు కలిసి ఊరుగొండ వైపునకు తమ ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అలాగే ఊరుగొండ గ్రామం నుంచి హనుమకొండ వైపునకు తక్కళ్ల చరణ్ తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కాగా, ఊరుగొండ సమీపం దుర్గంపేట శివారులోని ఆర్‌కే కన్వెన్షన్ హాల్ దగ్గరలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఇందులో మడికొండ మండలం తరాలపల్లికి చెందిన అరూరి అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే వేల్పుల రాజ్‌కుమార్, తక్కళ్ల చరణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి.

అయితే క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎంకు తరలించగా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతి చెందిన వేల్పుల రాజ్‌కుమార్‌కు మృతి చెందిన అశోక్ స్వయాన చెల్లిలి భర్త. అశోక్‌కు రెండేళ్ల కూతురు ఉంది. కాగా, ఆత్మకూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ పూట విషాదం

కాంట్రాక్ట్ వర్కర్ ఆత్మహత్య


అజిత్ కుమార్ (ఫైల్)

గిర్మాజిపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకున్న కొద్ది గంటల్లోనే ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం మత్రిమిట్ట గ్రామానికి చెందిన దాసరి అజిత్‌కుమార్ (30) హైదరాబాద్ చర్లపల్లి సమీపంలోని గెయిల్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. అతడికి భార్య నవ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. దసరా పండుగ కోసం మూడు రోజుల ముందే భార్య, పిల్లలను మత్రిమిట్టకు పంపించి తను బుధవారం ఉదయం వచ్చాడు. గురువారం దసరా పండుగను కుటుంసభ్యులతో సంతోషంగా జరుపుకున్నాడు.

అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు. రాత్రి 8 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో అబ్బనికుంట మైసమ్మ దేవాలయం వద్ద రైలు పట్టాల వద్దకు చేరుకొని కుటుంబసభ్యులకు ఫోన్ చేశాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నాని చెబుతూనే రైలు కిందపడ్డాడు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు సంఘటనా స్థలానికి చేరు కుని మృతదేహాన్ని అదేరాత్రి ఎంజీఎంకు తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేశారు. కాగా తను వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ తెలిపారు. దసరా పండుగను సంతోషంగా జరుపుకున్న అజిత్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబసభ్యులతో పాటు గ్రామస్థులను కంటతడిపెట్టించింది.

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆయుధ పూజ


ఆయుధాలకు పూజ చేస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయదశమి పండుగ పురస్కరించుకుని గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఆయుధ పూజ నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, ఆయుధాలతోపాటు వాహనాలకు పూజలు నిర్వహించారు. శమీ వృక్షాలకు పూజలు చేసి సిబ్బందితో పాటు అధికారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, క్రైం డీసీపీ గుణశేఖర్, అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్, శ్రీనివాస్, ఏఎస్పీ శుభం తదితరులు పాల్గొన్నారు.



WANTED
★ Medical Shop Boys(Exp),Lab-Techinicians (Exp) Dialasis Technicians (Exp) System Operators (Exp) in Hospital / Insurances Cont: Guardian Hospital Wgl. 2 to 3pm.
AJW-574

WANTED
★ Wanted English (Primary) Social-Studies(H.S) Teachers for Chaitanya Model High School Parkal. Part Time/Full Time.Cell.No: 7337069698
AJW-243191

WANTED
★ HNK లో గల రామప్ప జూనియర్ కళాశాల నందు ఇంటర్మీడియట్ విద్యార్థుల కొరకు వార్డెన్ (పు) కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. సం॥ప్ర॥ 9000271451, 8978836037
AJW-421

WANTED
★ HNK లో గల రామప్ప కళాశాల నందు వంటశాలలో పని చేయుటకు ధృఢంగా ఉన్న మగవారు మరియు భార్యాభర్తలు జంట కావలెను. జీతంతో పాటు ఉచిత వసతి మరియు భోజనం కల్పించబడుతుంది. సం॥ప్ర॥ 9985211479, 8978836037
AJW-421

ఆరోగ్యం + ఆదాయం
★ ఆరోగ్యం + ఆదాయం రెండూ పొందండి. హెల్త్ & వెల్‌నెస్ రంగంలో అవకాశం. ఫ్లెక్సిబుల్ టైమ్ - ఇంటి నుంచే పని. పూర్తి ట్రైనింగ్ ఇస్తాం. నోట్ : మహిళలకు మాత్రమే. 18 సం॥పైన సం॥ప్ర॥ 8125984818.
AJW-243518

PLOT FOR SALE
★ HNK-HYD Main Road, Near Bapuji Nagar S/F 180 Yrds (22x73) with old Construction 2 Shutters 3 Rooms Back. Cell.No: 9010858566, 9849018481
AJW-4339

HOUSES FOR SALE
★ Duplex House for Sale 140 Sq.Yards, Opp : Shyamala Gardens, TNGO's Colony, Road No: 6C & 6E. Cell.No 9949103115
AJW-243515

RENT / LEASE
★ ఆఫీస్/బిజినెస్‌కు అనుకూలమైనది 1st ఫ్లోర్ ఆఫీస్ కొరకు అనుకూలమైనది మరియు 3rd ఫ్లోర్ మొత్తం ఖాళీ స్థలం (మీ అవసరానికి తగట్టు ఫర్నీచర్ ఏర్పాటు చేసుకోవచ్చు ఆఫీస్‌లకు కోచింగ్ సెంటర్‌లకు లేదా చిన్న బిజినెస్ కొరకు అనుకూలమైనది అడ్రస్ : 12-8-244/1, హంటర్ రోడ్ సంతోషిమాత ఆలయం వెనుక, రామన్నపేట, వరంగల్. సం॥ప్ర॥ 9849404363
AJW-243511

LEASE / RENT
★ Wgl, Opp : CKM College Ground, Enumamula Road, 196 Sq.Yards Land Available for Lease / Rent. Cell : 9908577722
AJW-237447

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013, 8978510273, 9985411677
వరంగల్ 9949638376, 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9949638376
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

ధర్మానిదే అంతిమ విజయం

- విజయదశమి పండుగ సారం అదే
- ఉర్సు గుట్ట దసరా వేడుకలు ఓరుగల్లుకే గర్వకారణం
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ
- ఘనంగా సాగిన రావణవధ ఘట్టం


ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో దసరా వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ


విద్యుత్ కాంతులతో ఉర్సుగుట్ట రంగలీల మైదానం

కరీమాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అధర్మంపై ఎప్పటికైనా ధర్మమే విజయం సాధిస్తుందని, విజయదశమి పండుగ చెప్పే సారాంశం ఇదేనని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగరంలోని ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో గురువారం రాత్రి దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సురేఖతో పాటు ప్రత్యేక అతిథిగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, విశిష్ట అతిథులుగా నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, గౌరవ అతిథిగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ.. దుర్గామాత మహిషాసురుడిని వధించిన సందర్భంగా పది రోజుల పాటు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించి ఈ వేడుకలు జరుపుకుంటారని అన్నారు. ఇక్కడ జరుపుకునే వేడుకలకు దేశంలోనే దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించే రెండో ప్రాంతంగా పేరుందని అన్నారు. ఉర్సు గుట్ట ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సందర్భంలోనే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. ఆలయంలో రంగనాయక స్వామి రూపంతో చెక్కిన ఏకశిలరాతి శిల్పాన్ని కూడా ఏర్పాటు చేయించానన్నారు. గుట్ట పరిసర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని, అందుకోసం జిల్లా కలెక్టర్, పురావస్తు శాఖ, దేవాదాయ శాఖ అధికారులు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, నగర మేయర్, స్థానిక కార్పొరేటర్లతో ఓ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని శాఖలతో చర్చలు జరిపి ప్రణాళిక ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తామన్నారు. దసరా ఉత్సవాలకు మరింత స్థలం సేకరించే ప్రయత్నం చేస్తున్నానని, మైదానం ఎదురుగా ఉన్న స్థలాన్ని కూడా కేటాయిస్తామని, ఆ స్థలంలో నిర్మాణాలకు అనుమతి లేదని అన్నారు.


వరంగల్‌లోని ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో ఏర్పాటు చేసిన రావణాసురుడి ప్రతిమ

శాసన మండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఉత్సవాలకు ఏర్పాట్లు చేసిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ.. రంగలీల మైదాన ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి సురేఖ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్లు మరుపల్ల రవి, పోశాల పద్మస్వామి, పల్లం పద్మ రవి, ముష్కమల్ల అరుణ సుధాకర్, జలగం అనిత, దసరా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గోపాల నవీన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ గన్ క్రాకర్స్‌తో సందడి చేసి, రిమోట్‌తో రావణ వధ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సాంస్కృతిక సందడి


దసరా వేడుకల్లో జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పేరిణి, కూచిపూడి, భరతనాట్యం, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన వేడుకలు గంటన్నర పాటు కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రత్యేక లైటింగ్, దీపాలంకరణ వెలుగుల మధ్య ఉర్సు గుట్ట, రంగలీల మైదానం మెరిసిపోయింది.

పోలీసుల బందోబస్తు

పోలీస్ శాఖ ఉర్సు రంగలీల మైదానాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంది. సీపీ సన్‌ప్రీత్ సింగ్, ఏఎస్పీ శుభం ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాల ప్రారంభం నుంచి ప్రజలు తిరిగి వెళ్లే వరకు పోలీసులు ఎవరికీ ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు వాహనాలను దారి మళ్లించారు. అయినప్పటికీ నాని గార్డెన్ వద్ద తిరిగి వెళ్లే సమయంలో ప్రజలు ఒక్కసారిగా రోడ్డు మీదకు రావడంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది.

బాణసంచా విన్యాసాలు

రావణ వధ ఘట్టం ప్రజలను అమితంగా ఆకట్టుకుంది. సుమారు 70 అడుగుల ఎత్తయిన రావణ ప్రతిమను దహనం చేసే కార్యక్రమాన్ని మంత్రి సురేఖ రిమోట్ ద్వారా ప్రారంభించగానే వేలాది మంది ప్రజలు కేరింతలు కొట్టారు. దీంతో మైదానం దద్దరిల్లిపోయింది. సుమారు గంట పాటు సాగిన ప్రత్యేక బాణసంచా, తారా జువ్వల వెలుగుల మధ్య రంగలీల మైదానం మెరిసిపోయింది. ఆకాశంలో బాణసంచా విన్యాసాలను ప్రజలు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించుకున్నారు. కాగా, ఈ వేడుకలకు నగరం నుంచే గాక, సమీప గ్రామాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వేదికపైన వేడుకలను మైదానం బయట ప్రజలు తిలకించేందుకు వీలుగా ఆరు ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు.


రంగలీల మైదానంలో దహనమవుతున్న రావణాసురుడి ప్రతిమ


మహిళల సాంస్కృతిక కార్యక్రమం


రావణ వధను సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తున్న జనం


మైదానంలో జిగేల్‌మంటున్న బాణసంచా వెలుగులు


పూర్తిగా దహనమైన రావణాసురుడి ప్రతిమ

తండ్రీకొడుకుల గొడవలో బలైన తల్లి

- నెల్లికుదురు మండలం ఆలేరులో ఘటన


చీకటి స్వప్న (ఫైల్)

నెల్లికుదురు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : తండ్రీకొడుకుల గొడవలో తల్లి బలైంది. క్షణికావేశంలో భార్యను గొడ్డలితో భర్త హత్య చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని ఆలేరులో శుక్రవారం జరిగింది. ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు కథనం ప్రకారం.. చీకటి నరేష్‌కు స్వప్నతో 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. స్వప్న(38) కిరాణం షాపు నిర్వహిస్తోండగా, నరేష్ తాటిచెట్లు ఎక్కుతూ కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వీరి కుమారుడు చీకటి విక్రమ్ దసరా పండుగ అయిన గురువారం రోజు స్నేహితులతో మద్యం తాగి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. దీంతో నరేష్ ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని శుక్రవారం ఉదయం చిన్నతనంలో తాగి అర్ధరాత్రి ఇంటికి వస్తావా? అని కుమారున్ని మందలించడంతో గొడవ ప్రారంభమైంది. గొడవ పెట్టుకోవద్దని తండ్రీకొడుకుల మధ్యకు స్వప్న వెళ్లగా, మద్యం తాగివచ్చిన కుమారునికి మద్దతు పలుకుతావా! అని నరేష్ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న గొడ్డలిని విసిరివేయడంతో మెడపై తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి ఎస్సై రమేష్‌బాబు, సీఐ సత్యనారాయణ చేరుకొని విచారణ చేపట్టారు. మృతురాలు సోదరి మాచర్ల ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించిన సీనియర్ సివిల్ జడ్జి


హనుమకొండలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జడ్జి క్షమాదేశ్ పాండే

బాలసముద్రం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సీనియర్ సివిల్ జడ్జి కమ్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ క్షమాదేశ్ పాండే శుక్ర వారం హనుమకొండలోని హెల్పింగ్ హ్యాండ్ డీఅడిక్షన్ కమ్ రిహబిలిటేషన్ సెంటర్‌లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఈ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రెండు దశాబ్ధాలుగా హెల్పింగ్ హ్యాండ్ డీ అడిక్షన్ సెంటర్ అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకొని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ పర్యవేక్షణలో ఈ క్లినిక్ నడుస్తుందని ఆమె వివరించారు. కార్యక్రమంలో డీఎల్ ఎస్ఏ సిబ్బందితోపాటు హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ అధ్యక్షులు పి.రాము తదితరులు పాల్గొన్నారు.


హనుమకొండలోని పద్మాక్షమ్మ గుట్ట వద్ద దసరా వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పాల్గొన్న ప్రముఖులు


జనగామ శ్రీరాంనగర్ కాలనీలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న ప్రజలు

ఘనంగా దసరా వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటిన సంబరాలు
- పలుచోట్ల రావణ వధలు
- పాల్గొన్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు
- నగర శివార్లలో పాలపిట్ట కోసం వెతుకులాట
- జమ్మి ఆకు పంచుకొని పరస్పరం శుభాకాంక్షలు

హనుమకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు దసరా వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. దసరా రోజే గాంధీ జయంతి రావడంతో మద్యం, మాంసం విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ ప్రజలు ఆనందోత్సవాల నడుమ వేడుకలు జరుపుకున్నారు. తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకారాలలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శమీపూజ, ఆయుధ పూజ, వాహనాలకు పూజలు చేశారు. ఒకరికొకరు జమ్మి ఆకు ఇచ్చి పుచ్చుకొని ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు.

పలు ప్రాంతాల్లో రావణాసురుడి దహన కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో, హనుమకొండలో పద్మాక్షి దేవాలయం సిద్ధేశ్వరాలయం మధ్య గుట్టల సమీపంలో రావణ వధ ఘట్టాలను భారీ ఎత్తున జరిపారు. బాణాసంచా పేలుళ్లు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల మధ్య రావణ వధ ఘట్టాలను చూసేందుకు రెండు కళ్లు చాల్లేదు. ఈ అద్భుత దృశ్యాలను ఎంతో ఉత్కంఠగా వీక్షించారు. శివనగర్‌లో రావణాసుర వధ కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. ఖిలా వరంగల్‌లో సైతం రావణ వధ ఘట్టాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. రంగశాయిపేట మహంకాళి మైదానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రావణ వధ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఎల్కతుర్తి మండలం దండెపల్లిలో, ఐనవోలు మండలంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఐనవోలులో అమ్మవారు నిజరూప అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గీసుకొండలో భారీగా మోహరించిన పోలీసు పహారా మధ్య దసరా వేడుకలు జరిగాయి. నర్సంపేటలో గురువారం దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మి చెట్టుకు పూజ చేసి సొరకాయ నరికి, అంగడి మైదానంలో ఏర్పాటు చేసిన రావణాసుర వధ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో దుర్గామాత ఉద్వాసన పూజలు పెద్దఎత్తున జరిగాయి. భజన పాటలు భక్తులను అలరించాయి. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, పరకాల, శాయంపేట, నడికూడ, ఆత్మకూరు, దామెర, హసన్‌పర్తి మండలాల్లో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి.

దసరా అంటేనే చుక్క, ముక్క. మందుబాబులు, మాంసం ప్రియులు విందులు, వినోదాలతో రోజంతా మునిగితేలారు. ఎటు చూసినా దసరా పండుగ వాతావరణం ఆనందోత్సవాల మధ్య తొణికిసలాడింది. దుర్గామాత శోభాయాత్రలు కూడా కన్నుల పండువగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం కోసం చెరువులవద్దకు తరలించారు. హనుమకొండ వేయిస్తంభాల గుడిలో ప్రతిష్ఠించిన దుర్గామాతను దసరా రోజున ఊరేగింపుగా తీసుకువెళ్లి పద్మాక్షి గుండంలో నిమజ్జనం చేశారు. అంతకు ముందు ఆలయ ఆవరణలోని కోనేరులో శ్రీచక్ర స్నానం కన్నుల పండువగా జరిగింది. దుర్గామాత ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

దసరా వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. దసరా వేడుకలు జరిగే స్థలాల్లో ముఖ్యంగా రావణాసుర వధ కార్యక్రమాలు జరిగే ప్రతీ చోట పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భారీ ఎత్తున జనం రావడంతో వాహనాలను ఇతర మార్గాల గుండా మళ్లించారు. గస్తీని ముమ్మరం చేశారు. ముఖ్య కూడళ్లలో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. దసరా రోజే గాంధీ జయంతి రావడంతో మద్యం షాపులను, మాంసం దుకాణాలను మూసివేశారు. మద్యం విక్రయాలు జరగకుండా గట్టి నిఘా వేశారు.


తొర్రూరులో దసరా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


వాజేడు మండలం పేరూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ


చెన్నారావుపేటలో సొరకాయను నరుకుతున్న దృశ్యం


ములుగులో రావణుడి ప్రతిమను కాల్చుతున్న ఆధ్యాత్మిక గురువు ... దాస్ స్వామి


భూపాలపల్లిలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో రావణ వధ


కేసముద్రంలో దుర్గామాతను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు

పల్లెల్లో 'స్థానిక' సందడి షురూ..

- గ్రామాల్లో విందులు.. విహార యాత్రలు
- ఖర్చులకు వెనుకాడేది లేదంటున్న ఆశావహులు
- ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షణలు

ఎల్కతుర్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. రిజర్వేషన్ అనుకూలించిన ఆశావహులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి విందులు, విహార యాత్రలు చేపడుతున్నారు. దసరా పండుగను పురస్కరించుకుని కొందరు ప్రత్యేక బ్యాచ్‌లుగా ఏర్పాట్లు చేసుకుని గ్రామాల్లో మద్యం, మాంసంతో విందులు ఇస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీసీలకు 42 శాతం బిల్లుపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు జరుగుతాయా? వాయిదా పడుతాయా? అన్న సందేహంలో ప్రజలు ఊగిసలాడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు వాయిదా పడుతాయనే ప్రచారం ఎల్కతుర్తి మండల పరిధిలో జోరుగా సాగుతోంది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కొందరు తప్పకుండా ఎన్నికలు జరుగుతాయనే ధీమాపై ముందుకు సాగుతున్నారు.

ఎల్కతుర్తి జడ్పీటీసీ ఎస్సీ జనరల్

ఎల్కతుర్తి జడ్పీటీసీ స్థానాన్ని ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన ఆశావహులు ఇప్పటికే ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. మండల నాయకులను వెంటేసుకుని కొందరు, ఒంటరిగా మరికొందరు ఎవరికి తోచినట్టుగా వారు ఆయా పార్టీ నేతలతో తమకు అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. గతంలో ఎల్కతుర్తి జడ్పీటీసీగా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన డాక్టర్ సుధీర్‌కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ ఎల్కతుర్తి జడ్పీటీసీగా గెలిపించి జడ్పీ చైర్మన్ పదవిని దక్కించుకుంది. దీంతో ఎల్కతుర్తి బీఆర్ఎస్ పార్టీకి చెందిన అప్పటి పోటీదారుల్లో కాస్త అసంతృప్తి ఏర్పడింది. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్నా ఆయా పార్టీల నేతలు తిరిగి అలాంటి సంఘటన పునరావృతం కాకుండా ఉండేందుకు స్థానిక నాయకుల ఎంపికలో అన్వేషణలు ప్రారంభించారు. స్థానికులకే అవకాశం కల్పించి గెలిపించుకోవాలని పార్టీల నేతలు పావులు కదుపుతున్నారు. ఎన్నికల్లో ఎంత ఖర్చునైనా భరిస్తామని, తమకు మాత్రం పార్టీ టికెట్ కేటాయించాలని ఆశావహులు వేడుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మరి కొందరు ఎస్సీ జనరల్ స్థానంలో ఎస్సీ మహిళను బరిలోకి దింపి ఎలాగైనా హనుమకొండ జడ్పీ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఎంపీపీ స్థానం ఎస్సీ మహిళ

ఎల్కతుర్తి ఎంపీపీ స్థానాన్ని ఎస్సీ మహిళకు కేటాయించారు. గతంలో ఎంపీపీగా ఎస్సీ మహిళ కొనసాగిన విషయం తెలిసిందే. తిరిగి ఆదే రిజర్వేషన్ ఎంపీపీ పీఠానికి అనుకూలించింది. ఎస్సీ జనరల్ స్థానాలకు ఎంపికైన గ్రామాల్లో మహిళలను బరిలోకి దింపి ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవాలని ఆయా పార్టీల నేతలు ఎత్తులు వేస్తున్నారు. బావుపేట ఎస్సీ మహిళ, దండేపల్లి ఎస్సీ జనరల్, ఎల్కతుర్తి ఎస్సీ మహిళ, గోపాల్‌పూర్ ఎస్సీ జనరల్ స్థానాలు ఖరారయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో ఎంపీపీ అభ్యర్థులుగా ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలాగే దామెర - 1 జనరల్, దామెర - 2 జనరల్ మహిళ, వల్భాపూర్ జనరల్‌గా కేటాయించగా ఆయా గ్రామాల్లో సైతం ఎస్సీ మహిళలను పోటీలోకి దింపి ఎంపీపీ పీఠానికి దక్కించుకునే విధంగా పలు పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఏది ఏమైనా అధిష్ఠానాల గుర్తింపు పొందిన వారికే ఆయా పదవులు లభిస్తాయని, వారిని ప్రసన్నం చేసుకుంటేనే అవకాశం లభిస్తుందని, ధన బలంతో పాటు ప్రజా బలం సమకూర్చుకోవాలనే ప్రయత్నంలో ఎన్నికల బరిలో నిలబడే ఆశవాహులు శ్రమిస్తున్నారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
8 ములుగు
శనివారం 4 అక్టోబరు 2025



గ్రామానికి వీధిలైట్ల వితరణ

తాడ్వాయి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో మేడారం గ్రామ పంచాయతీ పరిధి రెడ్డిగూడెంలో దసరా సందర్భంగా అదే గ్రామానికి చెందిన జంగా సాయిరెడ్డి జ్ఞాపకార్థగా ఆయన కుమారులు సంతోష్ రెడ్డి, వెంకటేశ్‌రెడ్డి రూప.20వేల విలువ గల వీధిలైట్లను వితరణ చేశారు. గ్రామానికి మంచి చేయాలనే సంకల్పంతో తాము ఉన్నామని వారు తెలిపారు. గ్రామ అవసరాల కోసం మరింత ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం : సూర్య


బహుమతులు ప్రదానం చేస్తున్న సూర్య

కన్నాయిగూడెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, మంత్రి సీతక్క తనయుడు కుంజా సూర్య అన్నారు. మండలంలోని ముప్పనపల్లి గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు మండలాల వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ క్రీడల్లో వాజేడు మండలం పూసూరు గ్రామానికి చెందిన టీమ్ మెదటి బహుమతి రూ. 20 వేలు, కన్నాయిగూడెం మండలం సర్వాయి గ్రామం టీమ్ రెండో బహుమతి రూ. 10 వేలు, భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం నిమ్మగూడెం టీమ్ రూ. 7 వేలు, స్పెషల్ బహుమతి కింద కన్నాయిగూడెం మండలంలోని ముప్పనపల్లి టీమ్ రూ. 4 వేలు అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండి అఫ్సర్ పాషా, పార్టీ మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు, ముప్పనపల్లి మాజీ సర్పంచ్ చీదారి సుమన్, బీసీ జేఏసీ మండల అధ్యక్షుడు ముదురుకోళ్ల భిక్షపతి తదితులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ స్థానం కోసం అభ్యర్థన పత్రం అందజేత

వాజేడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు పలువురు పోటీ పడుతున్నారు. వాజేడు జడ్పీటీసీ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయించడంతో ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసేందుకు పలువురు ఉత్సాహం చూపిస్తున్నారు. శుక్రవారం పేరూరుకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకుడు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగాసి రమేష్ తన అభ్యర్థన పత్రాన్ని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మకు అందజేశారు. మరికొంత మంది సైతం అభ్యర్థన పత్రాలను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆశావహుల జాబితాను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపిస్తామని విక్రాంత్ వర్మ తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

టేకుమట్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సాద ఓదెలు ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన విషయం విదితమే. అతడి కుటుంబాన్ని సంఘమిత్ర ట్రస్ట్ చైర్మన్ గుర్రపు రవీందర్ శుక్రవారం పరామర్శించారు. రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర ట్రస్ట్ వైస్ చైర్మన్ గుర్రపు రాజయ్య, నరేందర్, తోట సాగర్, సాద జోగులు, చిలుక రమేష్, గోస్కుల గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మంజూర్‌నగర్‌లో ఘనంగా శ్రీవారి మాస కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో గండ్ర జ్యోతి

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీవారి మాస కల్యాణోత్సవ ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి దంపతులు హాజరయ్యారు. వారి చేతుల మీదుగా కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మల్లేష్ (ఫైల్)

కాటారం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులోని సబ్‌స్టేషన్‌పల్లి సమీపంలో 353(సీ) జాతీయ రహదారిపై నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాచర్ల మల్లేష్(60) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాటారం ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... సెప్టెంబరు 29న సబ్‌స్టేషన్ పల్లి సమీపంలో టీవీఎస్ మోపెడ్‌పై ఇంటికి వెళ్తున్న మల్లేష్ రోడ్డు క్రాస్ చేస్తుండగా భూపాలపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. దీంతో మల్లేష్ తలకు తీవ్రగాయాలు కావడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే మల్లేష్ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు.

అంగరంగ వైభవంగా దసరా


వాహన పూజ అనంతరం సిబ్బందితో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ


ఆయుధ పూజలో భూపాలపల్లి అదనపు ఎస్పీ నరేష్‌కుమార్


ఏటూరునాగారంలో దహనం అవుతున్న రావణాసుర ప్రతిమ


కన్నాయిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

గోవిందరావుపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బొడ్రాయి వద్ద ఉత్సవ కమిటీ సోరకాయ కొట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించింది. రావణాసురవధ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రావణాసురుడి బొమ్మకు పస్రా సీఐ దయాకర్ బాణం సంధించగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ వత్తి వెలిగించగా ఎస్సై కమలాకర్ స్విచ్ ఆన్ చేశారు. అనంతరం సీఐ దయాకర్, ఎస్సై కమలాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ట్రెయినీ ఎస్సైలు అంజనేయులు, సతీష్‌లను ఉత్సవ కమిటీ శాలువాలతో ఘనంగా సత్కరించింది. ఈ వేడుకల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

• కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటుగా అన్ని గ్రామాల్లోని ప్రజలు దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో దుర్గాదేవి శోభాయత్ర జరిగింది. గుర్రేవుల, లక్ష్మీపురంలోని రామాలయంలో పూజలను నిర్వహించారు.

• వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలకేంద్రానికి చెందిన ల్యాగల సతీష్ ఇంటి నుంచి బోనాన్ని అంగరంగ వైభవంగా బొడ్రాయి వద్దకు చేర్చి ఘనంగా వేడుకలు నిర్వహించారు. బొడ్రాయి వద్ద సొప్పబెండ్లు, సోరకాయను కొట్టి దసరా వేడుకలు జరుపుకున్నారు. ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో ఘనంగా ఆయుధపూజ నిర్వహించారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయ దశమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జమ్మి చెట్టుకు అర్చకులు ఎల్లప్రగడ నాగేశ్వరరావుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలువాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు జమ్మి చెట్టుకు నూతన వస్త్రాలను అలంకరించి కొబ్బరికాయలను కొట్టారు ఓడవాడ సమీపలోని జంపన్నవాగు ఒడ్డున ఏర్పాటు చేసిన రావణవధ ప్రాంతం వద్ద జమ్మి చెట్టుకు అర్చకుడు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, గ్రామ పెద్దలు రావణవధ వద్దకు వచ్చి జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అంతేకాకుండా బాణసంచాకాల్చారు.

• భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): విజయదశమి పండుగ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యే పూజలు చేశారు. సిబ్బందితో కలిసి కలెక్టర్ వాహన పూజలు నిర్వహించారు. సీసీ ప్రదీప్, గన్‌మెన్ మోయిజొద్దీన్ పాల్గొన్నారు.

• మహదేవపూర్ రూరల్ (ఆంధ్రజ్యోతి) : పలిమెల, మహదేవపూర్ మండలాల వ్యాప్తంగా విజయదశమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జమ్మీ ఆకులు ఒకరికొకరు పంచుతూ దసరా శభాకాంక్షలు తెలుపుకున్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో దసరా పండుగ ఘనంగా నిర్వహించుకున్నారు .పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సూర్యనారాయణ నేతృత్వంలో ఆయుధ జరిగింది. మండల కేంద్రంలోని కాటారం, గారెపల్లి గ్రామాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, యువత ఆధ్వర్యంలో రావణాసురవధ కార్యక్రమం వైభవంగా జరిగింది. అలాగే . ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయం, గూడూరు ఆంజనేయ స్వామి ఆలయం, గారెపల్లి, ఎర్రగుంటపల్లిలో నెలకొల్పిన దుర్గమాత విగ్రహాలను అంగరంగ వైభవంగా పురవీధుల గుండా శోభా యాత్ర నిర్వహించి కాళేశ్వర త్రివేణి సంగమంలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎస్సై శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు తోట జనార్దన్, జాడి మహేశ్వరి, రవీందర్ రావు, వివిధ పార్టీల నాయకులు ప్రభాకర్ రెడ్డి, సందీప్, రాకేస్, కిరణ్, రంజిత్, భాస్కర్ రెడ్డి, ప్రభాకర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

• కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయుధ పూజను నిర్వహించారు. అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా జమ్మి చెట్టును నాటి పూజలు చేసిన అనంతరం కార్యాలయంలోని పోలీస్ అయుధాలకు ప్రత్యేక పూజలు చేశారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, ఆర్ఐ రత్నంతో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

• చిట్యాల (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా దసరా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని చింతల్లపల్లి, వెంకట్రావుపల్లి, తిర్మలపురం, చల్లగరిగ, గోపాలపురం, నైన్‌పాక, గిద్దెముత్తారం గ్రామాల్లో ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్ర నిర్వహించారు. చింతల్లపల్లిలో రావణాసురుడి దహన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్, ఏఎస్సై సమ్మిరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి-సత్యనారాయణ, కుల సంఘాల గ్రామ ఆలయాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రంగాచారి తదితరులు పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మల్లేష్ ఆయధపూజ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఎస్సైలు శ్రావణ్‌కు మార్, హేమ, ఈశ్వరయ్య, హెడ్‌కానిస్టేబుల్స్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.


రావణాసురుడి దహన కార్యక్రమంలో చిట్యాల ఎస్సై శ్రావణ్ కుమార్

• వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామంలోని పురవీధులలో అమ్మవారి శోభాయాత్రను నిర్వహించారు. భక్తులు, గ్రామ స్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ నృత్యాలు చేస్తూ అమ్మవారి విగ్రహంను గోదావరిలో నిమజ్జనం చేశారు. మండలంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వాజేడు, పేరూరు పోలీస్‌స్టేషన్‌లలో ఎస్సైలు జక్కుల సతీష్, గుర్రం కృష్ణప్రసాద్ ఆయుధ పూజను నిర్వహించారు.

• తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండలంలో దసరా పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లో ప్రజలు ఇంటి ఇలవేల్పులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామదేవతలకు వేద పండితుల మంత్రో చ్ఛరణల మధ్య పూజలు చేశారు. జమ్మి పంచుకుంటై అలాయ్ బలాయ్ తీసుకున్నారు.


కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఆయుధపూజ


వాజేడు మండలం ధర్మవరంలో దుర్గాదేవి శోభాయాత్ర


గోవిందరావుపేటలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం పొందిన పోలీస్ అధికారులు, పైడాకుల అశోక్


వెంకటాపూర్‌లో దసరా వేడుకలో భక్తజనం

సందడే సందడి

(5వ పేజీ తరువాయి)

ఊరేగింపుగా తరలివెళ్లి జమ్మిచెట్టుకు కంకణం కట్టి, పసుపు కుంకుమలు సమర్పించారు. జమ్మి ఆకును సేకరించి ఒకరికొకరు ఇచ్చిపుచ్చు కొని అలయ్‌బలయ్ చేసుకున్నారు. పాల పిట్టను చూసి పరవశించిపోయారు.

శోభాయాత్రలో పాల్గొన్న మంత్రి సీతక్క

శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా గురువారం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేం ద్రంతో పాటు ఆయా మండలాల్లో శోభాయాత్రలు జరిగాయి. దుర్గాదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజల అనంత రం వాహనాలపై ఊరేగించారు. ములుగులో రామాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క పాల్గొన్నారు.

వైభవంగా రావణుడి వధ

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక రావణ సంహార కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా జరిగాయి. ములుగులోని జాతీయ రహదారి సమీపంలో ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో రావణుడి వధ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కన్హయ్యలాల్, ఆత్మీయ అతిథిగా ఆధ్యాత్మిక గురువు రాజమనోహర్ దాస్ స్వామి హాజరయ్యారు. ధర్మజాగరణ సమితి అధ్యక్షుడు గండ్రకోట కుమార్‌తోపాటు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. స్థానికులు తండోపతండాలుగా తరలివచ్చి ఈ ఉత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.


రావణవధ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆధ్యాత్మిక గురువు రాజమనోహర్ దాస్ స్వామి

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

కాటారం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మం డలంలోని గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని మహాత్ముడి విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు, పలు పార్టీల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. గాంధీ జీ ఆశయాలను ప్రతి ఒక్కరూ సాధించాలని అన్నా రు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు జాడీ మహే శ్వరి, వెంకట్ రెడ్డి, ప్రభాకర్, రాజునాయక్, ఆర్యవైశ్య సంఘం నేతలు మద్ది నవీన్, పవిత్రం శ్రీను, రమేష్ బాబు, అనంతుల శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

● తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో జాతిపిత గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజలు, యువకులు, నాయకులు, అధికారులు గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్మా గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. శాంతి మార్గంలో నడవాలన్నారు.


కాటారంలో గాంధీ జయంతిలో నేతలు

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ స్వాతంత్ర్యం కోసం సాగించి చేసిన పోరాటం ఆదర్శమని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. గాంధీ మార్గం అనుసరణీయమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్‌ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, జిల్లా యూత్ కార్యదర్శి ఎమ్డీ. గౌస్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డీజే వాహనం ఢీకొని నాలుగేళ్ల బాలుడి మృతి



గూడూరు అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా వేడుకల కోసం ఏర్పాటు చేసిన డీజే వాహనం ఢీకొని ఓ బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని కొల్లాపురంలో గురువారం చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్సై గిరిధర్‌రెడ్డి కథనం ప్రకారం.. కొల్లాపురానికి చెందిన సోలం రాజు-రమ్య దంపతులకు ఇద్దరు కుమారులు సన్ని, జశ్వంత్ సంతానం. దసరా వేడుకలో భాగంగా సందడి కోసం ఏర్పాటు చేసిన డీజే వాహనాన్ని గ్రామంలో సాయంత్రం రివర్స్ తీస్తుండగా, వారి చిన్న కుమారుడు జశ్వంత్ (4) వాహనం టైరు కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావటంతో మహబుబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి జశ్వంత్ మృతి చెందినట్లుగా నిర్ధారించారు. తండ్రి రాజు ఫిర్యాదు మేరకు ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన డీజే వాహనం నడిపిన ఈసం చరణ్, ఈసం సందీప్ ఎపై కేసు నమోదు చేసి డీజే వాహనంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జయశంకర్
Jayashankar Aco - 9985426984,
Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram
SR - 7673960447 ACM - 9985411664